www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 21 నవంబర్ 2023



ఎస్‌జిఎఫ్‌కు భాస్కరరావుపేట విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి - కలిదిండి

అండర్-14, 17 త్రోబాల్ టీమ్ సెలక్షన్‌లో మండలంలోని భాస్కరరావు పేట విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఎస్‌జిఎఫ్ కృష్ణ జట్టుకు ఎంపికైనట్లు హెచ్‌ఎం కె.పాండురంగారావు తెలిపారు. విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరిగిన అండర్-14, 17 త్రోబాల్ టీమ్‌లో డి.బాల నాగసంతోష్, కె.రాము, బి.సాయి సంతోష్, కె.సూర్య గణపతి ఎంపికయ్యారన్నారు. ఎంపికైన విద్యార్థులను, తర్ఫీదు ఇచ్చిన జి.రవిబాబును ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది అభినందించారు.



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు



ఏలూరులో ధర్నా నిర్వహిస్తున్న కార్మికులు



చింతలపూడిలో మాట్లాడుతున్న బి.సోమయ్య

కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

మున్సిపల్ కార్మికుల ధర్నాలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

మున్సిపల్ కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ (ఆప్కాస్) కార్మికులను పర్మినెంట్ చేయాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.జాన్‌బాబు డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్త పిలుపు మేరకు సోమవారం స్థానిక నగర పాలక సంస్థ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జాన్‌బాబు మాట్లాడుతూ గత ఎన్నికలకు ముందు ప్రజాసంకల్ప యాత్రలో జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీని నెరవేర్చాలని, మున్సిపల్ కార్మికులను రెగ్యులర్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో దాదాపు 40 వేల మంది మున్సిపల్ కార్మికులు పని చేస్తున్నారని, వారిని పర్మినెంట్ చేస్తానని చెప్పి నాలుగున్నరేళ్లు గడుస్తున్నా హామీని నెరవేర్చలేదని విమర్శించారు. చాలీచాలని వేతనాలతో... అర్ధాకలితో బతుకుతున్న కాంట్రాక్ట్ కార్మికులను ఆదుకోవాలని, లేనిపక్షంలో కలెక్టరేట్ వద్ద వంటా వార్పు కార్యక్రమాన్ని చేపడతామని తెలిపారు. మున్సిపల్ కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్త సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. ధర్నానుద్దేశించి సిఐటియు నగర కార్యదర్శి జి.గోపీ మాట్లాడుతూ గడపగడపకూ అంటూ ఎలా వస్తారని, రాష్ట్రంలో 40 వేల మంది మున్సిపల్ కార్మికులు, వారి కుటుంబాల ఓట్లు మీకు అవసరం లేదా అని ప్రశ్నించారు. మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే గత ప్రభుత్వానికి పట్టిన గతే ఈ ప్రభుత్వానికి పడుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో బి.రమేష్, బి.వెంకటేశ్వరరావు, లావేటి కృష్ణ, టి.జార్జి, నాగమణి, లావేటి దుర్గారత్నం, లావేటి సీత, కె.కోటమ్మ బండి రాణి పాల్గొన్నారు.

నూజివీడు రూరల్: మున్సిపల్ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, వారిని రెగ్యులర్ చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి జి.రాజు డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికులు సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ అధ్యక్షులు హనుమాన్, మున్సిపల్ యూనియన్ నాయకులు జయలక్ష్మి, రజని, పద్మ, భారతి, భవాని, ఏడుకొండలు, రాజేంద్ర, గోవింద పాల్గొన్నారు.

చింతలపూడి: కార్మికులకు చెల్లించాల్సిన బకాయిలు వెంటనే ఇవ్వకపోతే దశలవారీ ఆందోళన చేపడతామని, సమ్మెకూ వెనుకాడబోమని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా గౌరవాధ్యక్షులు బి.సోమయ్య అన్నారు. చింతలపూడి నగరపంచాయతీ కార్యాలయం వద్ద కార్మికులు, మెప్మా ఆర్‌పిలు సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సోమయ్య మాట్లాడుతూ చింతలపూడి నగర పంచాయతీగా అప్‌గ్రేడ్ అయ్యి మూడు సంవత్సరాలవుతున్నా నేటికీ కార్మికులకు జీతాలు, హెల్త్ అలవెన్స్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. మెప్మా ఆర్‌పిలను వెలుగు కార్యాలయం నుండి నగర పంచాయతీకి బదిలీ చేసి పది నెలలు కావస్తున్నా జీతాలు చెల్లించడం లేదన్నారు. మెప్మా ఆర్‌పిల సంఘం జిల్లా నాయకురాలు ఎస్‌కె.సుభాషిణి మాట్లాడుతూ చింతలపూడి నగర పంచాయతీ మెప్మా ఆర్‌పిలను ఇన్‌గ్రేషన్ చేయకుండా, జీతాలు చెల్లించకుండా ఇబ్బందులకు గురి చేయడం తగదన్నారు. ఎనిమిది నెలలుగా వేతనాలు చెల్లించాల్సి ఉందని, సమస్య పరిష్కారానికి కమిషనర్ చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు నత్తా వెంకటేశ్వరరావు, కార్మికులు నాగరాజు, విజయరాజు, సత్యనారాయణ, మెప్మా కార్మికులు కృష్ణవేణి, యూన్నీస్, కుమారి, రాజ్యలక్ష్మి, నాగమణి, జ్యోతి పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం: మున్సిపల్ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని మున్సిపల్ కార్మికుల యూనియన్ గౌరవాధ్యక్షులు పి.సూర్యారావు డిమాండ్ చేశారు. సోమవారం మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సూర్యారావు మాట్లాడారు. ఆప్కాస్‌లో పని చేస్తున్న ప్రతి ఒక్కరినీ పర్మినెంట్ చేయాలని కోరారు. యూనియన్ పట్టణాధ్యక్షులు బి.బాలరాజు మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి కొత్తూరు లక్ష్మణ్, నేతలు గున్నే వెంకటేష్, ఉష, ఇంగర్తి లక్ష్మి, తుంగ మంగ, పెంటయ్య, దోమారు మంగ, మల్లి మేరి, బాలయ్య, రాంబాబు పాల్గొన్నారు.

పనులు ప్రారంభించని కాంట్రాక్టర్లు బ్లాక్‌లిస్టులోకి

అధికారులకు కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశం

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో ప్రభుత్వ పనులు నిర్ణీత సమయంలో చేపట్టని కాంట్రాక్టర్లను బ్లాక్‌లిస్ట్‌లో ఉంచాలని జిల్లా కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ అధికారులను ఆదేశించారు. స్థానిక జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో సోమవారం జిల్లాలో రోడ్లు, ప్రాధాన్యతా భవనాలు, జగనన్న ఇళ్ల నిర్మాణ ప్రగతిపై సంబంధిత శాఖల ఇంజినీరింగ్ అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా రోడ్లు భవనాల శాఖ ద్వారా జాతీయ రహదారుల విభాగంలో ఐదు రోడ్ల నిర్మాణ పనులకు టెండర్లు పూర్తయ్యి ఎల్‌ఒ ఇచ్చిన ఏడు రోజుల్లోగా అగ్రిమెంట్ చేయాల్సిన కాంట్రాక్టర్లు 45 రోజులు పూర్తి కావొస్తున్నప్పటికీ ఇంకా పూర్తి చేయకపోవడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్లు రోడ్లు పనులు పూర్తి చేయకపోవడంతో ప్రజలకు ప్రభుత్వంపై వ్యతిరేక ప్రభావం కలిగే అవకాశం ఉందని, వెంటనే కాంట్రాక్టర్లకు నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. నోటీసులకు స్పందించని కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్ట్‌లో ఉంచాలని ఆర్‌అండ్‌బి శాఖాధికారులను ఆదేశించారు. జిల్లాలో అధిక ప్రాధాన్యత గల రోడ్ల నిర్మాణ పనులను కూడా వేగవంతం చేయాలన్నారు. కొయ్యలగూడెం, రమణక్కపేట, ఆగిరిపల్లి, బొర్రంపాలెంల్లో చేపట్టిన పిహెచ్‌సి భవనాల నిర్మాణ పనులు కూడా వెంటనే పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రాధాన్యతా భవనాల నిర్మాణాలను కూడా వెంటనే పూర్తి చేయాలని, పూర్తి చేసిన భవనాలను వెంటనే వినియోగంలోకి తీసుకురావాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

పనిచేసే వాళ్లను ప్రోత్సహిస్తా.. అలసత్వం వహిస్తే కఠిన చర్యలు

జగనన్న ఇళ్ల నిర్మాణంలో అలసత్వం వహించే సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటానని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ హెచ్చరించారు. ప్రగతిపై సమీక్షిస్తూ జగనన్న ఇళ్ల నిర్మాణాలపై రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, దాని అమలులో అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని లక్ష్య సాధన పూర్తి చేయాలన్నారు. చిత్తశుద్ధితో పనిచేసే అధికారులు, సిబ్బందిని ప్రోత్సహిస్తానని, అదేసమయంలో లక్ష్యసాధనలో నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. జగనన్న ఇళ్ల నిర్మాణంలో అలసత్వం వహించే సిబ్బందికి ఇంక్రిమెంట్ నిలిపివేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా ఇటీవల చేబ్రోలులో జగనన్న ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయడంలో ఉత్తమ సేవలందించిన గృహనిర్మాణ శాఖ ఇంజినీరింగ్ అధికారులకు ప్రశంసాపత్రాలను కలెక్టర్ అందజేశారు. సమావేశంలో గృహనిర్మాణ శాఖ ప్రాజెక్ట్ అధికారి విజయరాజు, డ్వామా పీడీ రాము, వివిధ శాఖల ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

'స్పందన'కు 316 అర్జీలు

సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ వహించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - ఏలూరు



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

అర్జీదారుల సమస్యలపై సకాలంలో స్పందించి నిర్ణీత గడువులోగా సంతృప్తికర స్థాయిలో పరిష్కార మార్గాలు చూపాలని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం-స్పందన కార్యక్రమంలో కలెక్టర్‌తోపాటు జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి, డిఆర్‌ఒ ఎం.వెంకటేశ్వర్లు, డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, ఆర్‌డిఒ ఎన్‌ఎస్‌కె.ఖాజావలి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జివివి.సత్యనారాయణ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. జగనన్నకు చెబుదాంలో 316 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ మాట్లాడుతూ స్పందనలో అందిన అర్జీలను నిర్ణీత కాలవ్యవధిలో నాణ్యతతో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా శాఖలవారీగా అందిన అర్జీలపై క్షేత్రస్థాయిలో విచారించి ఫొటోలతో సహా నివేదికలను అప్‌లోడ్ చేయాలన్నారు. అర్జీదారుని సంతృప్తే ధ్యేయంగా పరిష్కార తీరు ఉండాలని ఆయన స్పష్టం చేశారు. అనంతరం జిల్లా, మండల అధికారులతో జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి మాట్లాడుతూ స్పందన అర్జీల్లో రీఓపెన్ అయిన వాటిని పెండింగ్‌లో ఉంచకుండా సత్వరం పరిష్కరించాలన్నారు.

నిత్యాన్నదాన ట్రస్ట్ పేరుతో వసూళ్లు..!

రెండేళ్లుగా నిలిచిన నిత్యాన్నదానం - లక్షల నగదు ఏమైందంటూ పలువురు విమర్శలు - దేవస్థానానికి చెల్లించాలని డిమాండ్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

పంచారామాల్లో ఒకటైన భీమవరంలోని శ్రీ ఉమా సోమేశ్వర జనార్ధన స్వామి ఆలయంలో నిత్యాన్నదానం ట్రస్ట్ పేరుతో లక్షల వసూలు చేశారు. గతంలో ఈ ఆలయంలో నిత్యాన్నదానం నిర్వహించేందుకు నిత్యాన్నదానం పేరుతో కొందరు ట్రస్ట్‌గా ఏర్పడి దాతల నుంచి విరాళాల సేకరించారు. సేకరించిన విరాళాలతో కొంతకాలం సోమేశ్వరస్వామి ఆలయంలో నిత్యాన్నదాన కార్యక్రమాన్ని సజావుగా కొనసాగించారు. అయితే కరోనా నేపథ్యంలో నిత్యాన్నదానం నిలిచిపోయింది. ఈ క్రమంలో స్వామివారి పేరుతో వసూలు చేసిన నగదు సుమారు రూ.48 లక్షల వరకూ నిల్వ ఉంటుందని, అయితే ఆ నగదు ట్రస్టు ఏర్పాటుచేసిన వ్యక్తులు దేవాలయానికి ఇప్పటివరకూ అప్పగించకపోవడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. సుమారు రెండేళ్లు గడుస్తున్నా ఆలయ అధికారులు ఇప్పటివరకూ పట్టించుకోకపోవడంపై దాతలు, యాత్రికులు ఆగ్రహం చేస్తున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా వసూళ్ల..

వాస్తవంగా ప్రముఖ పంచారామ క్షేత్రమైన సోమేశ్వర స్వామి పేరు మీద అనధికారికంగా వసూలు చేసే హక్కు ఎవరికీ లేదు. యాత్రికుల నుంచి విరాళాలు సేకరిస్తే నేరుగా ఆలయ పేరు మీద తీసుకోవాల్సి ఉంటుంది. ఎటువంటి అనుమతి లేకుండా బయట వ్యక్తులు ఒక ట్రస్ట్‌గా ఏర్పడి నగదు వసూలు చేయడం నిబంధనలకు విరుద్ధం. కనీసం వసూలు చేసిన నగదు సుమారు రెండేళ్లయినా ఆలయానికి చేరకపోవడం దారుణం. ఈ విషయంపై గతంలో పనిచేసిన ఆలయ ఇఒ నగదు వసూలు చేసిన సభ్యులతో మాట్లాడి నగదును రప్పించే ప్రయత్నం చేసినా ఆయన ప్రయత్నాలు ఫలించకపోగా ఆయన ఇక్కడి నుంచి బదిలీ కావాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. చివరకు గతంలో ఆలయ ఛైర్మన్‌గా పనిచేసిన మహిళ భర్త చేసిన పొరపాటుకు ఆమెను పూర్తిగా ఛైర్మన్ పదవి నుంచి తొలగించడమే కాకుండా కనీసం సభ్యురాలుగా కూడా ఉంచలేదు. పంచారామ క్షేత్రంలో చోటు చేసుకుంటున్న ఘటనలు యాత్రికుల మనోభావాలను దెబ్బతినేలా ఉంటున్నాయి. ఎంతో పురాతన ఆలయమైన పంచారామంలో ఎటువంటి అవకతవకలకూ ఆస్కారం లేకుండా చర్యలు చేపట్టాలని యాత్రికులు కోరుతున్నారు.

వెంటనే చర్యలు తీసుకోవాలి : డిప్యూటీ కమిషనర్

సోమేశ్వరస్వామి దేవాలయంలో బయట వ్యక్తులు ఆలయం పేరు మీద నగదు వసూలు చేయడం చట్ట విరుద్ధమని దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ ఎం.విజయరాజు తెలిపారు. సోమవారం ఓ ఫిర్యాదు తనిఖీల్లో భాగంగా సోమేశ్వర స్వామి దేవాలయానికి వచ్చిన ఆయనను ప్రజాశక్తి విలేకరి నిత్యాన్నదాన నగదుపై అడిగారు. ఆయన మాట్లాడుతూ ఎట్టి పరిస్థితుల్లో వసూలు చేసిన నగదు దేవస్థానానికి చేరేలా చర్యలు చేపట్టాలని ఆలయ ఇఒ కృష్ణంరాజుకు సూచించారు.

భాస్కరరావు మృతి పార్టీకి తీరని లోటు

సంతాప సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

ప్రజాశక్తి - చాట్రాయి



సంతాప సభలో మాట్లాడుతున్న రవి

భాస్కరరావు అకాల మరణం పార్టీకి, కుటుంబానికి తీరని లోటని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి అన్నారు. సిపిఎం మండల కార్యదర్శి కొలికిపోగు భాస్కరరావు గతనెల 31న అనారోగ్య కారణంగా మృతి చెందగా సోమవారం ఆయన గృహం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో నిర్వహించిన సంతాపసభలో భాస్కరరావు చిత్రపటానికి పూలమాలవేసి జోహార్లు అర్పించారు. వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి ఎం.హెూలీ మేరీ అధ్యక్షత వహించిన సభలో ఎ.రవి మాట్లాడుతూ ఆయన వృత్తిపరంగా ట్రాక్టర్ మెకానిక్‌గా పనిచేస్తూ పార్టీలో చేరి, మండల కార్యదర్శి స్థాయికి ఎదిగి అనేక ఉద్యమాల్లో పాల్గొన్నారన్నారు. అనారోగ్యంతో అకాలంగా మరణం చెందటం చాలా బాధాకరమన్నారు. పార్టీపై అభిమానంతో తన కుమారుడు లెనిన్‌ని పార్టీకి అందించారని, లెనిన్ ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులుగా పనిచేస్తున్నారని తెలిపారు. సమాజంలో అందరూ కుమారులకు వారసత్వంగా సంక్రమించిన డబ్బు, భూములు పంచి ఇస్తారని కానీ వారసత్వంగా తన కుమారుడిని పార్టీకి అందించిన ఘనత భాస్కరరావుకే దక్కిందని కొనియాడారు. అనంతరం జిల్లా కార్యదర్శి జి.రాజు, సిఐటియు జిల్లా అధ్యక్షులు డిఎన్‌విడి.ప్రసాద్, ఎన్టీఆర్ జిల్లా సిఐటియు అధ్యక్షుడు ఎ.వెంకటేశ్వరరావు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు నిమ్మగడ్డ నరసింహం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ, ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె.కళ్యాణ్, ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేట మండల కార్యదర్శి జి.నాగరాజు మాట్లాడారు. భాస్కర్‌రావు మృతికి తమ ప్రగాఢ సానుభూతిని కుటుంబ సభ్యులకు తెలియజేశారు. ఈ సంతాప సభలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్, సిఐటియు మండల కార్యదర్శి టిఎన్‌ఎం.సూరి, సిపిఎం మాజీ మండల కార్యదర్శి కొమ్ము ఆనందం, పార్టీ సభ్యులు గజ్వేల్లి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

హాస్టల్ మంజూరుపై హర్షం

కలెక్టర్‌కు ప్రిన్సిపల్ కృతజ్ఞతలు

ఏలూరు: కామవరపుకోట మోడల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు బాలికల హాస్టల్ మంజూరుకు కృషి చేసినందుకు కలెక్టర్ ప్రసన్నవెంకటేష్‌కు గోపన్నపాలెం ఎస్-ఎస్ఆర్ జిసిపిఇ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.నథానియల్ ధన్యవాదాలు తెలిపారు. బాలికల హాస్టల్ మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు.

నేడు అంగన్వాడీల సామూహిక దీక్షలు

ప్రజాశక్తి - భీమడోలు

అంగన్వాడీలకు ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయాలని కోరుతూ ఈ నెల 21న ఐసిడిఎస్ సిడిపిఒ కార్యాలయాల వద్ద సామూహిక దీక్షా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు తెలిపారు. దీనిలో భాగంగా భీమడోలు సిడిపిఒ కార్యాలయం వద్ద భీమడోలు ప్రాజెక్టు పరిధిలోని అన్ని మండలాల నుంచి వందలాదిగా అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకులు కార్యక్రమంలో పాల్గొంటారని ఆయన తెలిపారు. సన్నాహక సమావేశం స్థానిక సిఐటియు కార్యాలయం వద్ద అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు బి.స్వర్ణకుమారి, నాగమణి, గంగ పాల్గొన్నారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - చింతలపూడి

చట్టాలపై అవగాహన అవసరమని, చదువుతో పాటు సంస్కారం, దేశభక్తి పెంపొందించుకోవాలని చింతలపూడి జూనియర్ సివిల్ జడ్జి సి.మధుబాబు అన్నారు. పట్టణంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హక్కులు, బాధ్యతలు, ట్రాఫిక్ రూల్స్, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, బాల్య వివాహాల నిరోధక చట్టం, పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. పిల్లలు పౌష్టికాహారం తీసుకోవాలని, 6 సంవత్సరాల నుంచి 14 సంవత్సరాల వరకు విద్యా హక్కు చట్టం ద్వారా అందరూ చదువుకోవాలన్నారు. 14 సంవత్సరాల లోపు పిల్లలను కార్మికులుగా హోటళ్లలో, కర్మాగారాల్లో, షాపులలో పని చేయించకూడదని, ఎవరైనా బాలలను పనిలో పెట్టుకుంటే నేరమని అలాంటి వారికి జైలు, జరిమానా విధిస్తారని తెలిపారు. అనంతరం ఇన్‌ఛార్జి సిడిపిఒ లీలా కుమారి మాట్లాడుతూ 'గుడ్ టచ్‌చ, బాడ్ టచ్‌పై' అవగాహన కల్పించారు. ఆడ, మగ పిల్లలు సహోదర భావాన్ని కలిగి ఉండాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు డేవిడ్ రాజు, కుమారి మౌనిక, సోషల్ వర్కర్ ఎమ్‌డీ అక్బర్ అలీ, పట్టణ సిఐ మల్లేశ్వరరావు, ప్రధానోపాధ్యాయులు మురళీకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు ప్రశ్నించే తత్వం అలవర్చుకోవాలి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం



అంబెద్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బ్యూల

హక్కులు, బాధ్యతలు తెలుసుకొని ప్రశ్నించే వ్యక్తులుగా విద్యార్థులు ఉండాలని ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఒ ఎస్.బ్యూల సూచించారు. సోమవారం స్థానిక ఉప్పలమెట్ట డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాలలో మహిళాభివృద్ధి, స్త్రీ శిశ సంక్షేమ శాఖ, డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్, చైల్డ్ రైట్స్ అడ్వకసి ఫౌండేషన్ - క్రాప్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రిన్సిపల్ ఎన్.భారతి సహకారంతో అంతర్జాతీయ బాలల హక్కుల వారోత్సవ ముగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న బ్యూల మాట్లాడుతూ బాలికలు అన్ని రంగాలలో ముందుండాలని సూచించారు. చిన్న వయసులో పెళ్లి చేసుకుని బాలికలు తమ జీవితాలను దుర్భరం చేసుకుంటున్నారని తెలిపారు. చైల్డ్ ప్రొటక్షన్ ఆఫీసర్ నాన్ ఇనిస్ట్రేషన్ కేర్ ఆర్.రాజేష్ మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితి బాలలకు నాలుగు హక్కులను కల్పించిందని వాటి చట్టాలను, లక్ష్యాలను తెలుసుకొని వాటికి అనుగుణంగా జీవిస్తూ, బాలికలు అభివృద్ధికి తోడ్పడాలని ప్రభుత్వ, ప్రభుత్వేతర బాలల రక్షణ యంత్రాంగాలు పనిచేస్తున్నాయని తెలిపారు. బాలికలకు ఎక్కడైనా సమస్య ఎదురైనప్పుడు చైల్డ్ హెల్ప్ లైన్ 1098, 100 పోలీసు, బాలల రక్షణ అధికారి వారికి తెలియజేసి మీ హక్కులను కాపాడుకోవచ్చని వివరించారు. పిల్లలు అభివృద్ధి చెందాలంటే అందుకు చదువే ప్రధాన కారణమని చెప్పారు. ఈ కార్యక్రమంలో క్రాప్ కోఆర్డినేటర్ ఎస్.రవిబాబు, వైస్ ప్రిన్సిపల్ టి.అరుణ, డిసిపియు యూనిట్ కౌన్సిలర్ యు.బాలస్వామి, అంగన్‌వాడి టీచర్స్ పాల్గొన్నారు.

గర్భిణులు వైద్యుల సలహాలు పాటించాలి

ప్రజాశక్తి - భీమడోలు

గర్భిణీలు తొలి దశ నుంచి పిల్లల ఆరోగ్య పరిరక్షణపై వైద్యుల సలహాలు, సూచనలు పాటించి వైద్య సేవలు పొందాలని భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రం పర్యవేక్షకులు డాక్టర్ సునీత కోరారు. స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఈనెల 15 నుంచి 21వ తేదీ వరకు కొనసాగే జాతీయ నవజాత శిశువుల ఆరోగ్య పరిరక్షణ వారోత్సవాల సందర్భంగా అవగాహన సదస్సును సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సామాజిక ఆరోగ్య కేంద్రం మత్తు వైద్య నిపుణులు డాక్టర్ అశ్విని, డాక్టర్ రష్మీ ప్రసంగించారు. అనంతరం సునీత మాట్లాడుతూ పుట్టిన పిల్లల ఆరోగ్య పరిరక్షణ విషయమై తల్లీ, పిల్లల మధ్య ఆరోగ్యవంతమైన అనుబంధం ఉండాలని కోరారు. భీమడోలు పిహెచ్‌సి ద్వారా గర్భిణులు తొలి దశ నుంచి ప్రసవం వరకు ఆరోగ్య పరిరక్షణ అంశాలపై ప్రభుత్వ నియమ నిబంధనల మేరకు ఉత్తమ సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. నవజాత శిశువుల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేకించిన వైద్య సేవలు అందుబాటులో ఉండవల్సి ఉందన్నారు. గతంలో సామాజిక ఆరోగ్య కేంద్రంలో నెలకు నాలుగు వరకు మాత్రమే జరిగే ప్రసవాల సంఖ్య ప్రస్తుతం 21 నుంచి 25 వరకు చేరిందన్నారు. ఇదేవిధంగా తల్లీ, పిల్లల ఆరోగ్యం చిరకాలం కొనసాగించేందుకు అవసరమైన సలహాలు, సూచనలు ప్రస్తుతం నిర్వహిస్తున్న కార్యక్రమంలో తెలియజేస్తున్నట్టు తెలియజేశారు.

ప్రసాదాల తయారీలో కులవివక్ష తగదు

కెవిపిఎస్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సురేష్, ఫ్రాన్సిస్

ఏలూరు అర్బన్: తిరుమల ప్రసాదాల తయారీలో కులవివక్ష పాటించటం న్యాయం కాదని, తక్షణం టిటిడి విడుదల చేసిన నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.సురేష్, అందుగుల ఫ్రాన్సీస్ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. తిరుమల ఆలయానికి ఎంతో ప్రాధ్యానత ఉందని, తిరుమలలోని పోటులో ప్రసాదాల తయారీకి కేవలం వైష్ణవ బ్రాహ్మణులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని టిటిడి యాజమాన్యం తరపున నోటిఫికేషన్ ఇవ్వడం అభ్యంతరకరమని, తక్షణం దీనిని రద్దు చేయాలని వారు కోరారు. గతంలో ఇఒగా పనిచేసిన ఐవైఆర్ కృష్ణారావు ఈ రకమైన నోటిఫికేషన్‌ల విడుదలకు కారకులయ్యారని, ఆ సందర్భంగా తీవ్ర వివాదం వ్యక్తమైన విషయాన్ని గుర్తు చేశారు. ఆలయ గేట్లు నుంచి వాహనాల వరకు బరువైన ప్రసాదాల ట్రేలను దళితులు మోస్తున్నారని, ప్రసాదాలను మోయటానికి లేని వివక్ష తయారీకి ఎందుకు వచ్చిందని ప్రశ్నించారు. టిటిడి యాజమాన్యం ఈ నోటిఫికేషన్‌ను ఉపసంహరించుకొనేలా దేవాదాయ ధర్మదాయ శాఖ ఉత్తర్వులు ఇవ్వాలని తమ సంఘం ద్వారా లేఖ రాశామని వారు ఈ ప్రకటనలో తెలిపారు.

ప్రజలకు సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి

చింతలపూడి: రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అందిస్తుందని సీతానగరం సర్పంచి గాయం మల్లేశ్వరావు అన్నారు. మండలంలోని సీతానగరం గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో కంటి పరీక్షలు చేసిన వారికి కళ్లజోళ్లని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా చాలా మందికి లబ్ధి చేకూరుతుందన్నారు. ఉచిత వైద్యం, మందులు పేద ప్రజలు ఉపయోగించుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి రాంబాబు, తమ్మిశెట్టి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

'కార్మికులకు కనీస పెన్షన్ ఇవ్వకపోవడం సిగ్గుచేటు'

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్



ఇపిఎఫ్ ఆఫీసు వద్ద ధర్నా నిర్వహిస్తున్న పెన్షన్ దారులు

కేంద్రంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పెన్షన్‌దారులను చిన్నచూపు చూస్తున్నారని, 25, 30 సంవత్సరాలు కష్టపడి పనిచేసి రిటైర్ అయి నటువంటి కార్మికులకు కనీస పెన్షన్ కూడా అమలు చేయకపోవడం సిగ్గుచేటని ఆల్ పెన్షన్ దార్ల రాష్ట్ర నాయకులు అజయ్ కుమార్, జిల్లా అధ్యక్షులు విజిఎంఆర్ కృష్ణారావు అన్నారు. ఇపిఎఫ్ పెన్షన్ దారులకు కనీస పెన్షన్ రూ.9 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ పెన్షన్ దారుల ఆధ్వర్యంలో స్థానిక ఇపిఎఫ్ ఆఫీసు వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి ఆల్ పెన్షన్ దార్ల రాష్ట్ర నాయకులు అజయ్ కుమార్, జిల్లా అధ్యక్షులు విజిఎంఆర్ కృష్ణారావు మాట్లాడుతూ గతంలో ఇపిఎఫ్ పెన్షన్ దారులకు కనీస పెన్షన్ పెంచుతామని హామీ ఇచ్చారని, కానీ ఆ హామీని ఇంతవరకు అమలు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఇపిఎఫ్ పెన్షన్ దారులకు కనీస పెన్షన్ రూ.9 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిఐటియు నగర అధ్యక్షులు బి.జగన్నాధరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెన్షన్ దారులను గాలికి వదిలి పెట్టారన్నారు. గతంలో పెన్షన్ దారులకు రైల్వేలో ప్రయాణం చేస్తే వారికి రాయితీలు కల్పించారని, వాటిని మోడీ రద్దు చేయడం బాధాకరమన్నారు. పెన్షన్ దారులకు ఉచిత వైద్య సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే డిఎతో కూడిన పెన్షన్‌ని అమలు చేయాలని కోరారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి ఇపిఎఫ్ పెన్షన్ దారులకు కనీస పెన్షన్ అమలు చేయకపోతే రానున్న ఎన్నికల్లో పెన్షన్ దారులు సరైన గుణపాఠం చెప్తారని హెచ్చరించారు. అనంతరం ఉభయగోదావరి జిల్లాల టీచర్స్ ఎంఎల్‌సి షేక్ సాబ్జి ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతిని సమర్పించారు. కార్యక్రమంలో సొసైటీ ఉద్యోగుల నాయకులు టి.గంగరాజు, సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి వి.సాయిబాబు, జి.కోటేశ్వరరావు, ఆర్.నరసింహామూర్తి, డి.దుర్యోధన, జి.అప్పన్న పాల్గొన్నారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

ఏలూరు: బాలల గ్రంథాలయం ఏలూరులో వారోత్సవాల ముగింపు, బహుమతి ప్రధాన కార్యక్రమంలో ఉభయగోదావరి జిల్లాల టీచర్ ఎంఎల్‌సి సాబ్జి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం సెక్రటరీ గుడిపాటి నరసింహారావు, అభివృద్ధి కమిటీ అధ్యక్షులు జిల్లెలమూడి నరసింహారావు, సభ్యులు గుడిమెట్ల అచ్యుత, తిరుపతి రమేష్ బాబు పాల్గొన్నారు.

చింతలపూడి: గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో నగరపంచాయతీ కమిషనర్ ఎన్.రాంబాబు, గ్రంథాలయ ఛైర్మన్ మిర్యాల దిలీప్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల సచివాలయాల కన్వీనర్ త్సల్లాబత్తుల శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి జ్ఞానరెడ్డి , రాజు పాల్గొన్నారు.

భీమడోలు: పూళ్ల శాఖ గ్రంథాలయ ముగింపు కార్యక్రమంలో డిఎన్‌బి.అమర్నాథ్, జెడ్‌పిటిసి సభ్యులు తుమ్మగుంట భవానీ రంగా, సర్పంచి దాయం సుజాత ప్రసాద్, మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ పివి.కృష్ణారావు పాల్గొన్నారు.

ఏలూరు అర్బన్: గ్రంథాలయాల ముగింపు కార్యక్రమంలో బికెఎంయు రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, రిటైర్డ్ లైబ్రరియన్ దొడ్డపునేని రాధాకృష్ణ పాల్గొన్నారు.

చాట్రాయి: చాట్రాయి గ్రంథాలయ వారోత్సవాలు సోమవారంతో ముగిశాయి. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి దామెర ఉష, మండల విద్యాశాఖాధికారి విఎస్‌వి.బ్రహ్మాచారి పాల్గొన్నారు.

టి.నరసాపురం: ప్రతిఒక్కరూ బాల్యం నుంచే పుస్తక పఠనం అలవర్చుకోవాలని ఎస్ఐ బి.సురేంద్ర కుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి మోదుగు సునంద, గ్రంథాలయ పాలకులు ఆర్.కిషోర్, గ్రంథాలయ మాజీ ఛైర్మన్ మాధంశెట్టి మల్లికార్జునరావు పాల్గొన్నారు.

ముసునూరు: గ్రంథాలయ అధికారిణి టి.రాజేశ్వరి ఆధ్వర్యంలో పలు పోటీల్లో ప్రతిభ కనబర్చిన భారతి విద్యానికేతన్, ఎస్ఎస్ఎన్, విద్యార్థులకు గ్రామ పెద్దలు గుడివాడ వెంకటేశ్వరరావు, తుల్లిమెల్లి సుబ్బారావు, కూసం సోభనాద్రిరావు ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు.

కలిదిండి : గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సభకు ఎంపిపి చందన ఉమామహేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఎంఇఒ ప్రభాకర్, స్థానిక ప్రయివేటు విద్యాసంస్థల అధినేతలు గొట్టుముక్కల సత్యన్నారాయణ రాజు, సానా మీనా సరస్వతి రాము, ఎంపిపి స్కూల్ హెచ్‌ఎం ఎ.రాజమోహన్ పాల్గొన్నారు.

ముమ్మరంగా నిధుల సమీకరణ : మానవత

భీమడోలు: స్వచ్ఛంద సంస్థ మానవత భీమడోలు శాఖ కార్యాలయం నిర్మాణానికి దాతల సహకారంతో అవసరమైన నిధులు సమీకరణ కార్యక్రమం ముమ్మరంగా సాగుతుందని సంస్థ భీమడోలు ప్రాంతీయ కోఆర్డినేటర్ పసుపులేటి సాంబశివరావు తెలిపారు. అంబర్ పేట గ్రామపంచాయతీ పరిధిలోని వడ్లపట్ల గ్రామంలో నివాసం ఉంటున్న ఒంటరి మహిళ ఆర్థిక ఇబ్బందులు పడుతున్నట్టు శాఖ దృష్టికి వచ్చిందన్నారు. ఈ నేపథ్యంలో స్పందించిన శాఖ సదరు మహిళ నివాసానికి సోమవారం వెళ్లి 25 కేజీల బియ్యం, నిత్యావసర వస్తువులతో పాటు భీమడోలుకు చెందిన సాయిరాం క్లాత్ షోరూం సౌజన్యంతో దుస్తులను అందజేశారు.

ప్రముఖ న్యాయవాది ఖాన్ ఆకస్మిక మృతి

నూజివీడు రూరల్: పట్టణానికి చెందిన ప్రముఖ సీనియర్ న్యాయవాది, 15వ అదనపు జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎన్ఎ.ఖాన్(58) సోమవారం మృతి చెందారు. పలువురు ప్రముఖులు సంతాపం, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

చంద్రబాబుకు బెయిల్‌పై టిడిపి నేతల హర్షం

భీమడోలు: చంద్రబాబుకు స్కిల్ కేసులో రెగ్యులర్ బెయిల్ రావడం పట్ల టిడిపి ఏలూరు పార్లమెంటరీ నియోజకవర్గం అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు హర్షం వెలిబుచ్చారు.

ద్వారకా తిరుమల: మండలంలోని టిడిపి నాయకులు చంద్రబాబు నాయుడుకు బెయిల్ మంజూరుపై హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర బిసి సెల్ సెక్రెటరీ కూరాకుల బుజ్జి యాదవ్, నియోజవర్గ వాణిజ్య సెల్ అధ్యక్షులు ఇమ్మాడి రత్నాజీ పాల్గొన్నారు.

యాత్రికుల కోసం ఏర్పాట్లు పూర్తి

పోలవరం : కార్తీక మాసం పురస్కరించుకుని పట్టిసీమ శివక్షేత్రానికి వచ్చే భక్తులకు ఏవిధమైన ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఆలయ కార్య నిర్వహణ అధికారి సంగమేశ్వర శర్మ తెలిపారు.

యుటిఎఫ్ మండల కమిటీ ఎన్నిక

నూజివీడు రూరల్: పట్టణంలోని యుటిఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో అధ్యక్షులుగా బొద్దు కోళ్ల బాబురావు, ప్రధాన కార్యదర్శిగా మల్లెల చెన్నకేశవరావు, ఆర్థిక కార్యదర్శిగా చెన్నం సంపత్ కుమార్‌లు ఎన్నికయ్యారు. ఏకగ్రీవంగా ఎన్నికైన వీరిని యుటిఎఫ్ నాయకులు, పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

పాఠశాలల అభివృద్ధి ప్రణాళిక తయారు చేయాలి : ఎంఇఒ

టి.నరసాపురం: పాఠశాలల అభివృద్ధి ప్రణాళికలో భాగంగా సమగ్ర సమాచారం అందజేయాలని మండల విద్యాశాఖ అధికారి-1 టి.రామమూర్తి సూచించారు. స్థానిక ఎంఇఒ కార్యాలయంలో సోమవారం పాఠశాలల హెచ్‌ఎంలకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామమూర్తి మాట్లాడుతూ 2024-25 విద్యాసంవత్సరానికి బడ్జెట్ ప్రణాళికను తయారుచేయుటకు, సమర్థవంతంగా పాఠశాలలు నిర్వహించటానికి పాఠశాలలకు కావలసిన వసతులు, ఉన్న వనరులతో ఏఏ అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలనే దానిపై విద్యాకమిటీలతో సమావేశాలు నిర్వహించి పాఠశాలల అభివృద్ధి ప్రణాళికను తయారుచేయాలని సూచించారు. ఈ సమావేశానికి ఎంఇఒ-2 ఎస్.కళ్యాణి, సిఆర్‌ఎంటిలు, డేటా ఆపరేటర్లు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

నూకాలమ్మ రజిత వస్త్రానికి వెండి విరాళం

జంగారెడ్డిగూడెం: నూకాలమ్మ రజిత వస్త్ర తయారీకి దాతలు వెండిని అందించారని ఆలయ ఛైర్మన్ డాక్టర్ రాజాన సత్యనారాయణ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు 35 కేజీల వెండితో నూకాలమ్మ అమ్మవారికి రజిత వస్త్రం తయారు చేయించ తలపెట్టినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో స్థానిక గంగానమ్మ గుడి సెంటర్, శ్రీనిహారిక జ్యూయలర్స్, మాడ సత్యనారయణ కుటుంబ సభ్యులు 10 తులాల వెండిని అందజేశారన్నారు.

గ్రామదేవతల ఆలయాల్లో వార్షికోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలులోని మూడు గ్రామదేవతల ఆలయాల 15వ వార్షికోత్సవ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించినట్లు ఆలయాల కమిటీ ఛైర్మన్ దత్తాడ శ్రీనివాసరాజు తెలిపారు. దీనిలో భాగంగా ఉదయం నుంచి పెద్ద ఎత్తున ఆలయాలకు తరలివచ్చిన మహిళలు మొక్కులను తీర్చుకున్నారని, గ్రామ దేవతలతో పాటు పోతురాజుకు ప్రత్యేక పూజలు నిర్వహించారన్నారు. అనంతరం ఆలయాల కమిటీ ఆధ్వర్యంలో మహిళలకు చీరలు, జాకెట్ ముక్కలు, గాజులు పంపిణీ చేసినట్లు తెలిపారు.

ఏలూరు రహదారిపై 'గుంతల ఆంధ్రప్రదేశ్‌కు దారేది'

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నూజివీడు-ఏలూరు ప్రధాన రహదారిలో టిడిపి ఆధ్వర్యంలో సోమవారం గుంతల ఆంధ్రప్రదేశ్‌కు దారేది అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం టిడిపి శ్రేణులు ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ముద్రబోయిన వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో రోడ్లపైకి రావాలంటే ప్రతి ఒక్కరికి భయం వేస్తుందన్నారు. ఏ ఒక్క రోడ్డు సరిగ్గా లేదని పెద్ద పెద్ద గోతులు దర్శనం ఇస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

కొత్తపట్టిసీమలో 'వై ఎపి నీడ్స్ జగన్'

ప్రజాశక్తి - పోలవరం

మండలంలోని కొత్త పట్టిసీమ గ్రామంలో వైసిపి మండల కన్వీనర్ బుగ్గా మురళీకృష్ణ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ, ఎంపిపి సుంకర వెంకటరెడ్డి మాట్లాడుతూ 33 వివిధ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిదారులకు రూ.20 కోట్ల 90 లక్షలు ఏవిధంగా అందాయో వివరించారు. అనంతరం వైసిపి జెండా ఆవిష్కరించి, పల్లెకి పోదాం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి మైగాపుల విజయదుర్గ, ఎంపిడిఒ జి.శ్రీను, పోలవరం ఎంపిపి సుంకర వెంకటరెడ్డి, సొసైటీ ప్రెసిడెంట్ అడ్డగర్ల సాయిబాబా, వైస్ ప్రెసిడెంట్ రంబ వాసు, సెక్రటరీ తాతి విజయ కుమారి పాల్గొన్నారు.

టి. నరసాపురం : మండలంలోని అల్లంచర్ల, రాజుపాలెం గ్రామంలో సోమవారం 'వై ఎని నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మండల జెడ్‌పిటిసి సభ్యులు సామంతపూడి బాల సూర్యనారాయణ రాజు మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వంలో ఇచ్చిన హామీలు ఒక్కటి కూడా చంద్రబాబు నెరవేర్చలేకపోయాడన్నారు. ఈ కార్యక్రమంలో జగ్గవరం సొసైటీ ఛైర్మన్ వాసిరెడ్డి మధు, బోళ్ల రంగారావు, కత్తి వెంకటేశ్వరరావు, ముత్యాలరావు పాల్గొన్నారు.

ఏలూరు టౌన్: సోమవారం స్థానిక 16వ డివిజన్ లోని అరుంధతి పేట సచివాలయం వద్ద జగనన్న నువ్వే మా నమ్మకం వార్డుకు పోదాం కార్యక్రమం ఏలూరు నగరపాలక సంస్థ కో-ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్.పెదబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పెదబాబు మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాల ద్వారా ప్రతిఒక్కరికీ లబ్ధి చేకూరుస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో 16వ డివిజన్ కార్పొరేటర్ జిజ్జువరపు విజయనిర్మల రమేష్, క్లస్టర్ అధ్యక్షులు సుంకర చంద్రశేఖర్, జెసిఎస్ జిల్లా అధ్యక్షులు శివరావు, జెసిఎస్ నియోజవర్గ కన్వీనర్ క్లస్టర్ వన్ అధ్యక్షులు సదానంద, యూత్ అధ్యక్షులు జుజ్జువరపు రమేష్, మహిళా అధ్యక్షులు రాధా, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

బీమా చెక్కు అందజేత

ఆగిరిపల్లి: ఆగిరిపల్లికి చెందిన గ్రంధి సుబ్రహ్మణ్యం ప్రమాదవశాత్తు మరణించటంతో ఆయన భార్య పార్వతికి పిఎంజెజెబివై కింద రూ.2 లక్షలు, పిఎంఎస్‌బివై క్రింద రూ.2 లక్షలు, ప్రమాదబీమా యోజన కింద రూ.4 లక్షల చెక్కును ఎస్‌బిఐ బ్రాంచి మేనేజర్ ఎస్.సునీల్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బిఐ సేల్స్ మేనేజర్ కాట్రగడ్డరాజేష్ పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి

ఆగిరిపల్లి: జరల్నిస్టుల సమస్యల పరిష్కారం కోసం ఆగిరిపల్లి శోభనాచల ప్రెస్ క్లబ్ నిరంతరం పోరాడుతుందని ఆగిరిపల్లి శోభనాచల ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు కె.ఐజక్‌జాన్ అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆగిరిపల్లి శ్రీశోభనాచల ప్రెస్‌క్లబ్ మొదటి సమావేశం ప్రధానకార్యదర్శి ఎస్ఎస్.బాబు(సూర్య) అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ ఉపాధ్యక్షులు సంగా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆర్గానిక్ ప్రొడక్ట్స్‌కు స్పందన

ముదినేపల్లి: స్థానిక బంటుమిల్లి రోడ్డులోని తహశీల్దార్ కార్యాలయం ఎదుట జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ తాతారావు ఆదేశాల మేరకు డిజిటల్ సిఆర్ పి.గౌతమ్ కుమార్ ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన కూరగాయలు, ఆకుకూరలు, బియ్యం, ఆర్గానిక్ ప్రొడక్ట్స్ స్టాల్‌కి మంచి స్పందన వస్తోందని డిజిటల్ సిఆర్ పి.గౌతమ్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ఇన్‌ఛార్జి నారాయణ పాల్గొన్నారు.

వణుదుర్రులో తాగునీటికి ప్రజల అవస్థలు

ముదినేపల్లి: వణుదుర్రులో ప్రజలు తాగునీటి కోసం తీవ్ర అవస్థలు పడుతున్నారని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి చిన్నం మాధవ అన్నారు. సోమవారం ఆయన ముదినేపల్లిలో విలేకరులతో మాట్లాడారు. స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని మాధవ కోరారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

ఏలూరు టౌన్: మాదక ద్రవ్యాలు జీవితాన్ని నాశనం చేస్తాయని, యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఏలూరు వన్‌టౌన్ సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ లక్ష్మణ్ అన్నారు. సోమవారం నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో అగ్రహారంలోని కస్తూరిబా నగరపాలక బాలికోన్నత పాఠశాల బాలికలకు 'డ్రగ్ ఫ్రీ సూపర్ హీరో' అనే అంశంపై అవగాహన కల్పించారు.